క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహాయం



ట్రస్టు బోర్డు సభ్యులకు నగదు అందజేస్తున్న దాత సంతోష్

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి అమ్మ వారి దేవస్థానం సమీపంలో చేపడుతున్న అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి పట్టణానికి చెందిన కొణతాల సంతోష్ రూ.1,01,000 విరాళం ఇచ్చారు. ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులకు తన నివాసంలో శనివారం నగదు అందజేశారు.దాత మాట్లాడుతూ తన తండ్రి రాము జ్ఞాపకార్థం ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయం అందించానని చెప్పారు. ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు అప్పికొండ ఆదిబాబు, గంట్యాడ విష్ణుమూర్తి, ఎస్.వి.జి.శ్రీనివాసరావు, దిలీప్‌కుమార్ ధనూకా, గుడ్ల శ్రీను పాల్గొన్నారు.

వాహన తనిఖీలు



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ లక్ష్మణరావు, పోలీసులు

గజపతినగరం రూరల్: మండల శివారు ప్రాంతంలోని మధుపాడ వద్ద జాతీయరహదారి–26పై ఎస్‌ఐ లక్ష్మణరావు పోలీస్ సిబ్బందితో కలిసి శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. వాహనాల పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌లు పరిశీలించారు. వాహన చోదకులకు ట్రాఫిక్ నిబంధనలపై ఎస్‌ఐ అవగాహన కల్పించారు. ద్విచక్రవాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని, లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గరుడుబిల్లిలో వైద్యశిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు

బొండపల్లి: మండలంలోని గరుడుబిల్లి గ్రామంలో విశాఖపట్నం హెచ్‌పీసీఎల్ రిఫనరీ ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో సుమారు 350 మందికి అపోలో వైద్యులతో పాటు, హెచ్‌పీసీఎల్ ఆస్పత్రి వైద్యులు వివిధ పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. హెచ్‌పీసీఎల్ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ.గౌరీశంకరరావు, ప్రధాన కార్యదర్శి బి.ఎస్.ఎస్.కుమార్, సర్పంచ్ బొద్దల కృష్ణవేణి, నాయకులు బొద్దల చిన్నంనాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ



దాతలు సమకూర్చిన విద్యాసామగ్రిని విద్యార్థులకు అందజేస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దాతలు శనివారం విద్యాసామగ్రి వితరణ చేశారు. గ్రామానికి చెందిన వీఓఏ ఎల్. జ్యోతి 9,10 తరగతుల విద్యార్థులకు జామెట్రీ బాక్సులు, 3,4,5 తరగతుల విద్యార్థులకు తొండవరపు రమణ డైరీలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలభాస్కరరావు, హెచ్‌ఎం బి.పి.ఏ.రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫ్రెషర్స్ డే వేడుకలు



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

శృంగవరపుకోట: స్థానిక వివేకానంద జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలను శనివారం నిర్వహించారు. ఇంటర్మీడియ్ జూనియర్ విద్యార్థులకు సీనియర్లు ఆహ్వానం పలికారు. సీనియర్లు, జూనియర్లు డ్యాన్స్‌లు, మిమిక్రీలు, స్టాండింగ్ కామెడీ, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలతో హుషారెత్తించారు. ఇదే కళాశాల అధ్యాపకులు విద్యార్థులు సాధించాల్సిన లక్ష్యాలు, గమ్యాలను వివరించారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

బొండపల్లి: మండలంలోని రయింద్రాం గ్రామంలో వ్యవసాయబోర్లకు సంబంధించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైనట్లు శనివారం ఫిర్యాదు అందిందని ఎస్‌ఐ యు.మహేష్ తెలిపారు. తమ పొలాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎవరో అపహరించారని రైతులు పి.అప్పలకొండమ్మ, ఏ.వరప్రసాద్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు.



మహిళా సిబ్బందికి రక్షణ కల్పించండి

ఆస్పత్రుల్లో విధులు నిర్వర్తిస్తున్న మహిళా వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బంది కోసం ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలి. కోల్‌కతా లో ట్రైనీ వైద్యురాలి విషయంలో జరిగిన సంఘటన చాలా దారుణం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దోషులను కఠినంగా శిక్షించాలి. ప్రజలకు ఎంతో సహనంతో వైద్యం అందించే మహిళా వైద్యులు, సిబ్బందిపై దాడులు చేయడం సరికాదు. రోగుల వెంట కొంతమంది సహాయకులు మద్యం సేవించి ఆస్పత్రికి వస్తుంటారు. వైద్య సేవలు అందించే సమయంలో సిబ్బందితో ఘర్షణలకు దిగుతుంటారు. విధుల్లో ఉన్న సిబ్బందితో దురుసుగా ప్రవర్తించే వారిని శిక్షించేలా చట్టాలు కఠినతరం చేయాలి.
– బేబీ రాణి, స్టాఫ్ నర్స్, గుర్ల పీహెచ్‌సీ





సెక్యూరిటీ గార్డులను నియమించాలి

ఆస్పత్రుల్లో మహిళా వైద్యులు, స్టాఫ్‌నర్స్‌లకు రక్షణ కల్పించాలి. సెక్యూరిటీ గార్డులను నియమించాలి. రెస్ట్ రూమ్‌ల సదుపాయం కల్పించాలి. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై చిన్న వయస్సు నుంచే పిల్లలకు అవగాహన కల్పించాలి. ఘటన జరిగిన క్షణాల్లో పోలీసులకు సమాచారం తెలిసే వ్యవస్థ రావాలి. కోల్‌కతాలో వైద్యురాలి హత్య చాలా బాధాకరం. ఇలాంటి ఘటనల్లో జాప్యం లేకుండా దోషులను కఠినంగా శిక్షించాలి. అప్పుడే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయి. తల్లిదండ్రులను చూసుకునే స్థాయికి వచ్చిన సమయంలో వైద్యురాలు హత్యకు గురి కావడం ఆ కుటుంబానికి తీరని లోటు.
– దీప్తి, వైద్యాధికారి, గరివిడి పీహెచ్‌సీ

వన మహోత్సవం



శృంగవరపుకోట: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ కేశవరావు తదితరులు



గజపతినగరం: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్లబ్‌ల నేతృత్వంలో శనివారం వన మహోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.కేశవరావు, అధ్యాపకులు కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటి సంరక్షించడం సామాజిక బాధ్యతగా భావించాలని చెప్పారు.మొక్కలు నాటడం కూడా దేశానికి చేసే పెద్ద మేలేనని, తద్వారా పర్యావరణాన్ని, జీవన చక్రాన్ని పరిరక్షించగలం అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వాసుదేవరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి..సంరక్షిద్దాం..

గజపతినగరం: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క అయినా నాటి సంరక్షించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ పిలుపు నిచ్చారు.వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించేందుకు వన మహోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు, ఐక్యూఏసీ కో– ఆర్డినేటర్ డాక్టర్ మాధవరావుచ అధ్యపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు

శృంగవరపుకోట: జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని సంతగవిరమ్మపేట గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం నేత్ర పరీక్షలు నిర్వహించారు. పీఎంఓ అనుపమ 62 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి 6వ తరగతికి చెందిన ఇద్దరు విద్యార్థులకు కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. వారికి ఉచితంగా కళ్లద్దాలు అందజేస్తామని చెప్పారు.హెచ్‌ఎం కె.బంగారునాయుడు, ఉపాధ్యాయులు కె.శ్రీరామ్మూర్తి, జి.వెంకటరావు, ఎల్.వెంకటరావు, ఆశవర్కర్లు గంగా భవాని, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

దత్తిరాజేరు మండలంలో..

దత్తిరాజేరు: మండలంలోని ఆర్.రామచంద్రపురం ఉన్నత, విజయరాంపురం ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థులకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శనివారం నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఆర్.రామచంద్రపురం పాఠశాలలో 100 మందికి, విజయరాంపురంలో 20 మందికి విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ పీఎంఓ నరసింహమూర్తి కంటి పరీక్షలు చేశారని కె.కొత్తవలస పీహెచ్‌సీ సూపర్ వైజర్ మురళీ తెలిపారు. కళ్లద్దాలు అవసరమైన విద్యార్థులకు ఉచితంగా అందజేస్తామని చెప్పారు.



శృంగవరపుకోట: సంతగవిరమ్మపేటలో విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న పీఎంఓ అనుపమ



దత్తిరాజేరు: రామచంద్రపురం పాఠశాలలో నేత్ర పరీక్షలు చేస్తున్న పీఎంఓ నరసింహమూర్తి

పొలంబడిని వినియోగించుకోండి



చీపురుపల్లి: పేరిపిలో రైతులకు వరి సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు



వేపాడ: దబ్బిరాజుపేటలో మాట్లాడుతూ వ్యవసాయ ఉపసంచాలకులు భారతి

చీపురుపల్లి: రైతులను శాస్త్ర వేత్తలగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న పొలంబడి కార్యక్రమాన్ని సద్వినియోగించుకోవాలని వ్యవ సాయశాఖ ఏడీ ఎన్.కోటేశ్వరరావు సూచించారు. పేరిపి గ్రామంలో శనివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వరిలోఅధిక దిగుబడులు సాధించేందుకు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఏడీ కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో పొలంబడి నిర్వహణకు 25 ఎకరాల ను అధికారులు గుర్తించారని, 30 మంది రైతులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 14 వారాల పాటు నిర్వహించనున్న పొలంబడి ద్వారా రైతులకు ఎంతో మేలు జరగనుందన్నారు. వరిసాగులో అధునాతన పద్ధతులపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. భూసారం ఆధారంగా ఎరువుల వినియోగం ఉండాలన్నారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని సూచించారు. పంట పొలంలో కాలిబాటలు తీయడం ద్వారా మేలు జరుగుతుందన్నారు. ఏఓ సీహెచ్.రఘునాథ్, వ్యవసాయ, ఉద్యానవన సిబ్బంది పాల్గొన్నారు.

దబ్బిరాజుపేటలో..

వేపాడ: మండలంలోని దబ్బిరాజుపేటలో జిల్లా రిసోర్స్ సెంటర్ వ్యవసాయ ఉపసంచాలకులు భారతి ఆధ్వర్యంలో శనివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వరి పంటలో సస్యరక్షణచర్యలు, యాజమాన్యపద్ధతులు,తెగుళ్ల నివారణ చర్యల పై రైతులకు అవగాహన కల్పించడానికే పొలంబడి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వరిపైరులో కాలిబాటలు తీయాలని సూచించారు. పొలం గట్లపై ఆకుకూరలు, కూరగాయలు, దుంప, తీగ జాతి పంటలను సాగుచేయడం ద్వారా పంటకు తెగుళ్ల బెడద ఉండదని, అదనపు ఆదాయం ఆర్జించవచ్చ న్నారు. కొత్తవలస ఏడీఏ ఎల్.విజయ, ఏఓ సి.బి.యశ్వంతరావు, ఏఈఓ రమేష్, అక్కు నాయుడు, ఎంటీఎల్ వసంత, ఎఫ్‌పీఓ లక్ష్మునాయుడు, ఏసీసీఎస్ఎఫ్, వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



హారిక

చీపురుపల్లి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న కుసుమూరు హారిక ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. తాజాగా ఎన్‌సీసీ కోటాలో ట్రిపుల్ ఐటీల్లో సీట్లను కళాశాలలు కేటాయించాయి. హారిక ఎన్‌సీసీలో పని చేయడంతో ఆ కోటాలో ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. విద్యార్థినిని హెచ్‌ఎం చంద్రశేఖర్, ఎన్‌సీసీ అధికారి శ్రీనివాసరావు శనివారం అభినందించారు.

బుక్ కీపర్లను తొలగించడం తగదు

బొండపల్లి: వెలుగు సమాఖ్యలో పని చేస్తు న్న బుక్ కీపర్లను రాజ కీయ కారణాలతో తొలగించడం తగదని ఎంపీ పీ చల్లాచలంనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.మండలంలోని కొండకిండాం, కనిమెరక, బి.రాజేరు గ్రామాల బుక్ కీపర్లను తమకు కానీ, స్థానిక ప్రజాప్రతినిధులకు కానీ సమాచారం ఇవ్వకుండా అధికారులు తొలగించారని చెప్పారు. అధికార పార్టీ నాయకుల ఆదేశాల మేరకు వారిని తొలగించడం దారుణ మన్నారు. అలాగే మరో నలుగురు బుక్ కీపర్లను తొలగించాలని చూస్తున్నారని ఆరోపించారు. జిల్లాకు చెందిన మంత్రి ఒత్తిడి కారణంగానే తొలగింపులు చేపడుతున్నామని అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. బుక్ కీపర్ల తరఫున పోరాటం చేస్తామని చెప్పారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులాహ్వానం

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులాహ్వానిస్తు న్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రావు పట్నాయక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో జువాలజీ, కంప్యూటర్ సైన్స్(వృత్తి విద్య) పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు.ఆసక్తి గల అభ్యర్థులు కళాశాల ద్వారా విజయనగరం డీవీఈఓ కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గంట్యాడ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బోటనీ(వృక్షశాస్త్రం) గెస్ట్ లెక్చరర్ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎల్.వి.ఎస్.జగన్నాధరావు ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు. బోటనీ సబ్జెక్టులో 50 శాతం మార్కులతో పోస్టు గ్రాడ్యుయేషన్ పాసైన అభ్యర్థులు ఈ నెల 27వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు విద్యార్హత ధ్రువపత్రాలు, బయోడేటా, ఫొటోతో కళాశాలను సంప్రదించాలన్నారు.

సంతలో సదుపాయాలు మెరుగుపరచాలి

జామి: లొట్లపల్లి పశువుల సంతలో సదుపాయాలు మెరుగుపరచాలని ఏపీ గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ నిర్వాహకులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సంతల మానటరింగ్ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంతలో సీసీ కెమెరాలు, మూగజీవాలకు తాగునీటి సదుపాయం, వాహనాలకు ఎక్కించేందుకు ర్యాంపులు తదితర సౌకర్యాలు ఉంటేనే సంత నిర్వహణకు లైసెన్స్ మంజూరు చేయలన్నారు. తహసీల్దార్ కృష్ణలత మాట్లాడుతూ లొట్లపల్లి సంతలో డ్రైనేజీ సమస్య పరిష్కరించి ప్లాస్టిక్ వాడకం లేకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.పంచాయతీ విస్తరణాధికారి శ్రీదేవి, వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రావ్య, స్థానిక సర్పంచ్ జన్నేల సింహాచలం, పంచాయతీ కార్యదర్శి ఎర్న మ్మ, గోసంరక్షణ సమాఖ్య కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

బొండపల్లి: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గజపతినగరం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి బి.కనకలక్ష్మి అన్నారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో ఆధ్వ ర్యంలో ఓంపల్లి గ్రామంలో బ్రైట్ ఫ్యూచర్ స్వచ్ఛంద సేవా సంస్థలో శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కలిగి ఉంటేనే రక్షణ పొందేందుకు అవకాశం ఉంటుంద ని చెప్పారు. ఉచిత న్యాయ సహాయం అవసరమైన వారు మండల లీగల్ సర్వీస్ కమిటీని సంప్రదించవచ్చన్నారు. న్యాయవాదులు కె.రమణాజీ, రాపాక సాయికుమార్, కె.రామునాయుడు, ఎస్.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి కనకలక్ష్మి

కార్మికులకు భద్రత కల్పించాలి

చీపురుపల్లిరూరల్(గరివిడి): పరిశ్రమల్లో ప్రమాదాలను నిలువరించాలని, భద్రత కమిటీ ఆడిట్ చేపట్టాలని డిమాండ్ చేస్తూ గరివిడి డీఎఫ్ఎన్ ఏరియాలోని రాధికా ఆయిల్ కంపెనీ వద్ద సీఐటీయూ నాయకులు శనివారం ఆందోళన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత 25 ఏళ్లలో జరిగిన ప్రమాదాలన్నింటీ కంటే అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో జరిగిందే అతిపెద్ద ప్రమాదమన్నారు. సంబంధిత కంపెనీ యాజమాన్యాన్ని వెంటనే అరెస్టు చేయాలని, పరిశ్రమల్లో కార్మికులకు భద్రత,రక్షణ కల్పించాలని కోరారు. ప్రమాదాలు జరగకుండా భద్రతా ప్రమాణాలు పాటించడంలో యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోపించారు. ప్రమాదాలపై ఉన్నత స్థాయి విచారణ చేపట్టి కారకులను శిక్షించాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర నాయకుడు టి.వి.రమణ,జిల్లా ఉపాధ్యక్షుడు అంబల్ల గౌరినాయుడు, కరణం సన్యాసినాయుడు, పిసిని అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు



నారాయణ కేంబ్రిడ్జ్ పాఠశాలలో శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో విద్యార్థులు



డి.వి.ఎల్ స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకల్లో విద్యార్థులు

పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు



కౌముది గ్లోబల్ స్కూల్‌లో ఉట్టి కొట్టే సంబరంలో విద్యార్థులు

శృంగవరపుకోట: మండలంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థు లు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలతో సంబరాలకు హాజరయ్యారు. ఉట్టి కొట్టు సంబరాలు, సంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి



పోలీసులు, న్యాయవాదులకు సూచనలు చేస్తున్న జడ్జి కనకలక్ష్మి

గజపతినగరం: స్థానిక ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ కోర్టులో సెప్టెంబర్ 14వ తేదీన నిర్వహించనున్న జాతీయ మెగాలోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జడ్జి బి.కనకలక్ష్మి కోరారు. పోలీసులు, న్యాయవాదులతో కోర్టులో శనివా రం సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కొంతమంది ప్రజలు అవగాహన లేక చిన్న విషయాలకే తగాదాలు పెట్టుకుని పోలీస్ స్టేషన్‌లు, కోర్టుల చుట్టూ తిరుగుతూ తమ విలువైన సమయాన్ని, భవిష్యత్‌ను పాడుచేసుకుంటున్నారని అన్నారు. ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించా రు.రాజీకి అవకాశం ఉన్న కేసులలో కక్షిదారులకు అవగా హన కల్పించి 14వ తేదీన నిర్వహించనున్న లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకునేలా పోలీసులు కృషి చేయాలని అన్నారు. గజపతినగరం సీఐ జి.ఎ.వి.రమణ, పలువురు ఎస్‌ఐలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మండల పరిషత్ నిధులతో బోరు ఏర్పాటు



బోరు డ్రిల్లింగ్ పనులను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: పట్టణంలోని జి.అగ్రహారం సచివాలయం–1 పరిధిలో మండల పరిషత్ నిధులు రూ.2 లక్షలతో తాగునీటి బోరు ఏర్పాటుకు శనివారం డ్రిల్లింగ్ పనులు చేశారు. పనులను వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిషత్, జిల్లా పరిషత్ నిధులతో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మీసాల వరహాలనాయుడు, వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, బెల్లాన వంశీకృష్ణ, కొసిరెడ్డి రమణ, రౌతు పైడిరాజు, కర్రోతు ప్రసాద్, మజ్జి శంకర్, కంచుపల్లి అశోక్, కోరుకొండ దాలయ్య, మండల రాజారావు, ప్రభాత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

గజపతినగరం రూరల్: ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే ఎంతటి వారిపై అయినా చర్యలు తప్పవని తహసీల్దార్ రత్నకుమార్ అన్నారు. మండల కేంద్రం లోని విద్యుత్ కార్యా లయ సమీపంలోని జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పలువురు ఆక్రమించారని అందిన ఫిర్యాదు మేరకు ఆస్థలాన్ని తహసీల్దార్ శనివారం పరిశీ లించారు. ఆక్రమణలను ఖాళీ చేయాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలకు బాధ్యులవుతారని ఆక్రమణదారులను హెచ్చరించారు.ఆయన వెంట ఎస్‌ఐ లక్ష్మణరావు, తహ సీల్దార్ కార్యాలయ సీనియర్ సహాయకులు మురళి ఉన్నారు.



ఆక్రమిత స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, తదితరులు

అన్యాయంగా తొలగిస్తున్నారు...



ఏఓ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేస్తున్న వీఓఏ త్రివేణి

శృంగవరపుకోట: ఏళ్ల తరబడి గ్రామంలో అన్ని మహిళా సంఘాల మన్ననలు అందుకునేలా పనిచేస్తున్న తనను అన్యాయంగా తొలగిస్తున్నారని వసి గ్రా మ వీఓఏ జి.త్రివేణి ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏఓ శ్రీనివాస్‌కు శనివా రం ఫిర్యాదు అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తనను తొలగించి ఆ స్థానంలో మరొకరిని నియమించేందుకు కొందరు టీడీపీ పెద్దలు ప్రయత్నాలు చేస్తున్నారని తెలియడంతో మహిళా సంఘాలను కలిశానని చెప్పారు. గ్రామంలోని 29 సంఘాల్లో 28 సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు అంతా తనని కొనసాగించాలని తీర్మానాలు చేశారన్నారు. వాళ్లందరి ఆమోదంతో ఈనెల 12న ప్రజాపరిష్కార వేదికలో ఫిర్యాదు చేశానంటూ చెప్పారు. దీనిపై ఏవిషయం చెప్పకుండా శనివారం ఉదయం వెలుగు సీసీ మూర్తి ఇంటికి వచ్చి రికార్డులు లాక్కునే ప్రయత్నం చేశారని వాపోయింది. అధికారులు విచారణ చేసి న్యాయం చేయాలని కోరింది.

వీఆర్ఓపై ఫిర్యాదు

బొండపల్లి: ఫ్రీ హోల్డ్ భూముల పట్టాలు, లేట్ డెత్ సర్టిఫికెట్‌ల మంజూరు చేసేందుకు తమ నుంచి లక్షల రూపాయలు తీసుకుని పనులు చేయకుండా అన్యాయం చేశారని, గతంలో బొండపల్లి వీఆర్ఓగా పనిచేసి ప్రస్తుతం దేవుపల్లిలో పనిచేస్తున్న డి.రవిపై కనిమెరక,బోడిసింగిపేట తదితర గ్రామాల రైతులు తహసీల్దార్ డి.రాజేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దార్‌ను కలిసి తమ సమస్య ను వివరించారు. ఫ్రీ హోల్డ్ భూముల పట్టాలు, లేట్ డెత్ సర్టిఫికెట్లు మంజూరు చేస్తామని వీఆర్ఓ రవి తమ నుంచి లక్షల రూపాయలు తీసుకుని, పని చేయకుండా ముఖం చాటేశారని ఆరోపించారు. తహసీల్దార్ స్పందించి రెవెన్యూ అధికారులతో చర్చించి, వీఆర్ఓ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేసి నివేదిక అందజేయాలని ఆదేశించారు. నివేదిక వచ్చిన తర్వాత బాధితులకు న్యాయం చేయడంతో పాటు వీఆర్ఓ రవికి మెమో జారీ చేస్తామని తహసీల్దార్ తెలిపారు.



తహసీల్దార్ రాజేశ్వరరావుతో మాట్లాడుతున్న రైతులు